క్లుప్తంగా

వైభవంగా లక్ష బిల్వార్చన

కడియం: కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. వేదపండితుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రంధి వీర వెంకట సత్యనారాయణ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు.

రేపు క్రిస్మస్ వేడుకలు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలోని రమాదేవి గార్డెన్స్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకు రాజమహేంద్రవరం డివిజన్ ఎంప్లాయిస్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ కాన్ఫెడరేషన్ (న్యూఢిల్లీ), ఏపీ ప్రేయర్ టీం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ చింతా సురేష్ గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ దైవజనులు, ఆరాధన టీవీ స్పీకర్, హైదరాబాద్ ఎల్షడాయి చర్చి పాస్టర్ ఎంఎస్ సునిత్ వర్ధన్ క్రిస్మస్ సందేశాన్ని అందిస్తారన్నారు.

కబడ్డీ పోటీలు



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న బీజేపీ నాయకులు

కడియం: బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నమో కబడ్డీ పేరిట స్థానిక హైస్కూల్ ఆవరణలో గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతగా నిలిచిన కడియం మండల జట్టుకు బీజేపీ నాయకుడు పి.నాగేంద్ర చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఆ పార్టీ నాయకుడు బొర్సు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొటికలపూడి వెంకటేశ్వరరావు, చిక్కాల శ్రీనివాస్, గారపాటి తాతబ్బాయి పాల్గొన్నారు.

మహాకవి గురజాడ అప్పారావుకు నివాళి



గురుజాడ అప్పారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సంజీవరావు తదితరులు

సీటీఆర్ఐ: ఆనాటి సామాజిక రుగ్మతలను ఎత్తి చూపే ప్రయత్నంలో అక్షరాన్ని ఆయుధంగా చేసుకున్న కవి గురజాడ అప్పారావు అని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగుశాఖాధిపతి, డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో తెలుగు శాఖ, కళాగౌతమీ ఆధ్వర్యంలో గురువారం గురజాడ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవరావు మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక దురాచారాలను తన రచనలలో పాత్రల ద్వారా చెప్పించి, పాఠకుల హృదయంలోకి చొచ్చుకొని పోయేలా చేశారన్నారు. తెలుగు అధ్యాపకుడు ఎస్.రాజ్ కుమార్ మాట్లాడుతూ స్త్రీకి సమాజంలో ఒక మంచి స్థానాన్ని కల్పించాలని కోరుకున్న వారిలో గురజాడ మొదటివారు అన్నారు. తెలుగు అధ్యాపకురాలు పల్లి సుధ మాట్లాడుతూ గురజాడ ఎంచుకున్న పాత్రలు, వస్తువులు జీవితానికి దగ్గరగా ఉంటాయన్నారు. హితకారిణి తెలుగు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చీర్ల సీతారామ నాయుడు, అధ్యాపకులు పి.బాబూరావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పదార్థాల తయారీపై శిక్షణ

సీతానగరం: ఉండేశ్వరపురం మల్లంపాటి సీతారామయ్య ఉద్యాన పంటల ప్రదర్శన క్షేత్రంలో గురువారం చిరుధాన్యాలతో ఆహార పదార్థా తయారీపై శిక్షణ, ప్రదర్శన నిర్వహించారు. షెడ్యూల్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కేవీకే ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్) హెడ్ డాక్టర్ వీఆర్‌జీఆర్ నాయుడు, ఎస్ఎంఎస్ (హార్టీ) జేవీఆర్ సత్యవాణి, ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ షేక్ మహమ్మద్ వలీ, మిర్తిపాడు ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి, మల్లంపాటి సీతారామయ్య, పీఏసీఎన్ఎఫ్ రామకృష్ణ, వరలక్ష్మి, హారీష, రమేష్, కేవీకే అధికారులు టి.విజయవర్ధన్, ప్రభాత్ నాయుడు పాల్గొన్నారు. సీతానగరం, గోకవరం, కోరుకొండ మండలాల నుంచి 70 మంది గ్రామీణ మహిళలు హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ మహిళా రైతులు చిరుధాన్యాల ఆవశ్యకత – ఆహారపు అలవాట్లపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. 2023 ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించడం హర్షదాయకమన్నారు. మైదా, పంచదార, బొంబాయి రవ్వ మొదలైన పదార్థాలు వాడకుండా బిస్కెట్లు, కేకులు, మురుకులు, చేగోడీలు, దోశ పిండి మిశ్రమాల తయారీపై అవగాహన కల్పించారు.

భోజనం వితరణ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో గురువారం దాతల సహకారంతో పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. పల్లేటి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు సుమారు 150 మంది నిరుపేదల ఇళ్లకు నేరుగా వెళ్లి భోజనం అందించారు. సమితి సభ్యులు పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవం.. కనుల వైభవం



గౌరీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం చుట్టూ వెలిగించిన దీపాలు




విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న మహిళలు

- ఆకట్టుకున్న దీపాలంకరణ
- తరలివచ్చిన భక్తులు
- గౌరీచంద్రమౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



దీపం వెలిగిస్తున్న బాలిక



శివలింగం, ఓకారం ఆకారంలో దీపాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని గౌరీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి లక్ష దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి దీపాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణం, కొలను చుట్టూ దీపాలు కనువిందు చేశాయి. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ముందుగా అర్చకులు గౌరీచంద్ర మౌళీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక టి.నగర్‌లోని బాలా త్రిపురసుందరీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం (జోడిగుళ్లు)లో కార్తిక మాసం సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ ఎన్‌డీ శ్రీనివాస్, డైరెక్టర్ల ఆధ్వర్యంలో 300 మంది మహిళలతో సువాసినీ పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు చంద్రమౌళీశ్వరరావు ఉదయం నుంచి స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ఎం.శోభారాణి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, జిల్లా కార్యదర్శి కొప్పినీడి ప్రసాద్ బాబు(రాజమౌళి) పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే జగన్ సంకల్పం

- మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్



క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే జగనన్న సంకల్పమని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 32వ డివిజన్ ఇన్‌చార్జి ముప్పన శ్రీను ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ఇంటింటికీ పర్యటించారు. జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలు పొందిన లబ్ధిని తెలుపుతూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళా సంక్షేమానికి జగన్ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఆయన ప్రవేశ పెట్టిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు అనుసరించాయన్నారు. విద్యా రంగంలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకం వల్ల అక్షరాస్యత రేటు పెరుగుతోందన్నారు. నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ రూ.125 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎస్సీ సెల్ నగర అధ్యక్షురాలు సాలా సావిత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి
- ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: జగన్ పాలనలో సచివాలయాలు కేంద్రంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. నగరంలోని నాలుగు సచివాలయాల పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాల బోర్డులను ఆవిష్కరించి, అనంతరం వైఎస్సార్ సీపీ జెండాలను ఎగురవేశారు. అడపా శ్రీహరి మాట్లాడుతూ నాలుగు సచివాలయాల పరిధిలో రూ.63.78 కోట్ల మేర లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. సుమారు రూ. 7 కోట్ల అంచనా విలువ కలిగిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. 9వ డివిజన్ 18వ సచివాలయం పరిధిలో సుమారు 14.19 కోట్లు, 46వ డివిజన్ 85 నంబర్ ఆనందనగర్ సచివాలయంలో రూ.14.79 కోట్లు, 42వ డివిజన్ రూ.13.53 కోట్లు, 33వ డివిజన్ 61వ నంబర్ లక్ష్మీవారపుపేట సచివాలయం పరిధిలో రూ.14.19 కోట్ల సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు అందిందన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, అర్జరపు వాసు, పెంకే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నూతన చిత్రం ప్రారంభం



హీరో, హీరోయిన్లపై క్లాప్ కొడుతున్న ఎంపీ భరత్ రామ్



నూతన చిత్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని ఈట్ ఎండ్ ప్లే హోటల్లో గురువారం విఘ్నేశ్వర సినీ క్రియేషన్స్ ప్రొడక్షన్ నంబర్ 1 నూతన సినిమా ప్రారంభమైంది. నగరానికి చెందిన ఏకుల జితేంద్ర దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో జిందగీ సినిమా ఫేం ఫణి ప్రకాష్ హీరోగా, సార్ మూవీ చైల్డ్ ఆర్టిస్ట్ ఫేమ్ భవ్యశ్రీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్ర పూజా కార్యక్రమానికి ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, బీజేపీ మహిళా నేత నర్సిపల్లి హారిక హాజరయ్యారు. కెమెరాను ఎమ్మెల్యే రాజా ప్రారంభించగా, హీరో హీరోయిన్లకు ఎంపీ భరత్ క్లాప్ కొట్టారు. చిత్రంలో కమెడియన్ భద్రం, జబర్దస్త్ అప్పారావు తదితరులు నటిస్తున్నారు. చిన్నప్పుడు తన అమ్మ చెప్పిన కథను ఈ చిత్రంగా మలుస్తున్నానని డైరెక్టర్ జితేంద్ర తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ ఉదయ్ చేస్తుండగా, ప్రహర్షితాదేవి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబర్ మొదటి వారంలో పూర్తిస్థాయి షెడ్యూల్ ఉంటుందని, గోదావరి అందాలు, మన్యం ప్రాంతాల్లో చిత్రీకరణ ఉంటుందని చిత్ర యూనిట్ తెలిపింది.

ఎయిడ్స్ నియంత్రణ సామాజిక బాధ్యత



ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు



ర్యాలీలో పాల్గొన్న న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి, డాక్టర్ వసుంధర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం, అపోహలు తొలగించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. వరల్డ్ ఎయిడ్స్‌డే పురస్కరించుకుని గురువారం సాయంత్రం కోటిలింగాలరేవువద్ద హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. అనంతరం కోటిలింగాలరేవు నుంచి కోటిలింగాలపేట అంబేడ్కర్ విగ్రహం వరకూ క్యాండిల్ లైట్ ర్యాలీని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలైన కనకదుర్గ, దేవిక, శానీలకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర బహుమతులు అందజేశారు.

నేడు వరల్డ్ ఎయిడ్స్‌డే సందర్భంగా..

వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధ్యక్షతన జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంబాలచెరువు పార్కు ప్రాంగణంలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై కమ్యూనిటీ అవగాహన సమావేశం జరగనుంది. ఈ మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర ప్రకటన విడుదల చేశారు.

రోప్ స్కిప్పింగ్‌లో సత్తా

ప్రకాశం నగర్: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు యామినిదేవి, ఎం.నాగదేవి ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కొలాజియేట్ టోర్నమెంట్ టీమ్ సెలక్షన్ ట్రైల్స్‌లో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కళాశాల పీడీ వై.సుధారాణి గురువారం ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి ఆ విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారన్నారు.

నర్సరీ సందర్శన

కడియం: రాప్తాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్ గురువారం కడియపులంకలోని సత్యదేవ నర్సరీని సందర్శించారు. నర్సరీ రైతు పుల్లా చంటియ్య ఆయనకు ఘన స్వాగతం పలికి వివిధ రకాల మొక్కల గురించి వివరించారు. ఆయన వెంట స్థానిక నాయకులు వెలుగుబంటి రఘురామ్, కొరపాటి చౌదరి, మెర్ల కృష్ణమూర్తి, చక్కపల్లి పుల్లయ్య ఉన్నారు.

రాజమహేంద్రి ప్రిన్సిపాల్ సౌందర్యకు డాక్టరేట్



తేతలి సౌందర్యను సత్కరిస్తున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

ప్రకాశం నగర్: రాజమహేంద్రి మహిళా జూనియర్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్యకు లండన్‌కు చెందిన బ్రిటీష్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ క్వీన్ మేరీ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఆమె ఇటీవల తిరుచ్చిలో జరిగిన ఒక కార్యక్రమంలో డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల రాజమహేంద్రి కళాశాలలో విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్యను ఘనంగా సత్కరించారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా దరఖాస్తును యూనివర్సిటీకి పంపితే, వారు అన్ని విషయాలను ధ్రువీకరించి, గౌరవ డాక్టరేట్‌కు అర్హురాలిగా ప్రకటించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరికి ఈ గౌరవ డాక్టరేట్‌లు లభించగా అందులో తేతలి సత్య సౌందర్య ఒకరు కావడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సత్యనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెస్టారెంట్లపై అధికారుల దాడులు



రెస్టారెంట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రకాశం నగర్: రెస్టారెంట్లలో ఉపయోగిస్తున్న ఎడిబుల్ ఆయిల్స్‌లో టోటల్ పోలార్ కాంపౌండ్స్ (టీపీసీ) మీటర్ రీడింగ్ 25 శాతానికి మించి ఉంటే, సంబంధిత రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ ఎ.సురేష్ బాబు హెచ్చరించారు. నగరంలోని మూడు రెస్టారెంట్లపై గురువారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోని ఐరన్ హిల్ బార్, రెస్టారెంట్, కుమారి థియేటర్ సమీపంలోని నెల్లూరు మెస్, ఏవీ అప్పారావు రోడ్డులోని కృష్ణ కల్యాణి దివెన్యూ రెస్టారెంట్‌ను తనిఖీ చేశారు. ఎంఆర్‌పీ కన్నా అధికంగా అమ్మకాలు, గడువు తీరిన పదార్థాలు, ఎడిబుల్ ఆయిల్ టీపీసీ ఎక్కువ ఉండడం, అనధికారికంగా సిలిండర్ల వాడకం తదితర అంశాలపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలు నాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి భార్గవ మహేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుళ్లు వలీ, లోవకుమార్, కిషోర్, వీరబాబు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై విస్తృత ప్రచారం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఓటరుగా నమోదు చేయించుకునేందుకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన సదావకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. స్వీప్ కార్యాచరణలో భాగంగా గురువారం ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల, డాక్టర్ అల్లు రామలింగయ్య హోమియో కళాశాల, కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల, ప్రియదర్శిని నర్సింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024 జనవరి ఒకటికి 18 ఏళ్లు నిండేవారందరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. మరింత సమాచారం సహాయం కోసం టోల్ ఫ్రీ నంబరు 1950కు డయల్ చేయవచ్చునన్నారు. డిసెంబర్ 9 వరకూ స్వీప్ అవగాహన కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటు లేకుండా ఉండకూడదనే ఉద్దేశంతో శాశ్వత కియోస్క్‌లను నగరంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెల్త్ అధికారి డాక్టర్ వినూత్న, తహసీల్దార్ సుస్వాగతం, సహాయ ఓటరు నమోదు అధికారి (ఏఈఆర్ఓ) వరహాల బాబు పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవలో కనక మహాలక్ష్మి బ్యాంకు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: సామాన్య, మధ్యతరగతి ప్రజల అవసరాలను తీర్చేందుకు తమ బ్యాంకు ఆవిర్భవించిందని కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. ప్రజల ఆశీసులతో 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగు పెట్టిందన్నారు. బ్యాంకు రజతోత్సవం సందర్భంగా గురువారం నగర శాఖ ఆవరణలో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకూ వివిధ జిల్లాలలో 28 శాఖలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. 1,707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్ ధనంతో కేవలం ఏడుగురు సిబ్బందితో బ్యాంకు ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం 17,300 మంది సభ్యులతో రూ.31 కోట్లు వాటా ధనం పొంది రూ.1380 కోట్ల వ్యాపారం చేస్తూ అర్బన్ కో ఆపరేటివ్ రంగంలోనే ముందంజలో ఉందన్నారు. సాంకేతికపరంగా కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా కోఆపరేటివ్ రంగంలో ఖాతాదారులకు సేవలందిస్తున్నామన్నారు. డైరెక్టర్ సీపీ రామారావు మాట్లాడుతూ తమ బ్యాంకు ఏర్పాటైన నాటి నుంచి ఖాతాదారుల, శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు సాగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సామాన్య ప్రజల అవసరాలను తీర్చడంలో బ్యాంక్ వినూత్న సేవలను అందిస్తోందన్నారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్ బి.పుల్లయ్య, ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్ కిషోర్, రీజినల్ మేనేజర్ సింహాచలం, శాఖ మేనేజరు ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

3న కాపు ఉపాధ్యాయుల వనసమారాధన

ప్రకాశం నగర్: కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న లాలాచెరువులోని పుష్కర వనంలో కార్తిక వనసమారాధన, సంఘ ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు చేబ్రోలు చలం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపిశెట్టి బంగారు రాజు, మద్దాల అప్పారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకులతో పాటు జిల్లాలోని కాపు కులపెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రతిభావంతులైన పేద కాపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడంతో పాటు సీనియర్ ఉపాధ్యాయులను సత్కరిస్తామన్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సీటీఆర్ఐ: పోలవరం నిర్వాసిత మండలాలను అత్యాచారాలకు గురవుతున్న ప్రాంతాలుగా ప్రభుత్వం గతంలో ప్రకటించినందున ఈ మేరకు ప్రత్యేకాధికారులు సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినారపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాలను నివారించి, నిర్వాసితులకు తక్షణ న్యాయం చేయాలని కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న పోలవరం ప్రాజెక్టు బడ్జెట్ విషయమై ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం సమావేశం నిర్వహిస్తుందని, ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని అత్యాచారాలకు గురవుతున్న ప్రాంతంగా ప్రకటించాలని ఆదివాసీ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల మేరకు 2001లో అప్పటి ప్రభుత్వం జీవో నంబరు 116 జారీ చేసిందని తెలిపారు. పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాలు అధికంగా అత్యాచారాలకు గురవుతున్నట్టు అప్పటి ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

బ్యాంకుఖాతాలో రూ.73 వేలు మాయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యుత్ బిల్లు చెల్లించాలంటూ ఫోన్ చేసిన వ్యక్తికి ఓటీపీ చెప్పడంతో బ్యాంకుఖాతాలోని రూ.73 వేలు మాయమయ్యాయని నిడదవోలుకు చెందిన విశ్రాంత లెక్చరర్ అట్లూరి గౌరీరావు గురువారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గౌరీరావుకు దానవాయిపేటలో ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతా ఉంది. ఈ ఏడాది అక్టోబరు 14వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి అతడికి ఫోన్‌చేసి విద్యుత్‌బిల్లు బకాయి ఉందన్నాడు. వెంటనే చెల్లించాలని, బిల్లులు పంపిస్తానని వివరాలు తీసుకుని ఓటీపీ వస్తుందని చెప్పాడు. మరుసటిరోజు ఓటీపీ రావడంతో గౌరీరావు అతడికి చెప్పాడు. దీంతో బ్యాంకుఖాతాలోని రూ.73 వేలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ పి.పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గామన్ బ్రిడ్జిపై బుధవారం రాత్రి వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ వీరయ్యగౌడ్ తెలిపారు. సుమారు 30 ఏళ్ల వయసున్న అతడు కాతేరు వద్ద గామన్ బ్రిడ్జిపై నుంచి కొవ్వూరు వైపు వెళుతున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ 94407 96532కు తెలయజేయాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సీతానగరం: దూళ్ల దుర్గాప్రసాద్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఇటీవల ముగ్గళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజంపేటకు చెందిన దుర్గాప్రసాద్ మృతి చెందారు. ఈ నేపథ్యంలో గురువారం బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి రాజా పరామర్శించారు. ఆ కుటుంబబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు.

సినిమాలు



శ్యామల : యానిమల్
సూర్యమినీ : పల్లెగూటికి పండగొచ్చింది
సూర్యప్యాలెస్ : కాలింగ్ సహస్ర
స్వామి : మంగళవారం
శివజ్యోతి : కోటబొమ్మాళి పీఎస్
అనుశ్రీ : కాలింగ్ సహస్ర
రాజా : యానిమల్
అశోక : యానిమల్
ఊర్వశి : ఆదికేశవ
రంభ : యానిమల్
మేనక : అధర్వ
అప్సర : యానిమల్

నామవరం
వీఎస్ మహల్ : యానిమల్

ధవళేశ్వరం
మురళీకృష్ణ : యానిమల్

కడియం
వెంకటసూర్య : యానిమల్